శ్రీరామా.. భద్రత ఎక్కడ..?

- లక్ష్మి లిఫ్టు సబ్‌స్టేషన్‌లో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం
- భారీగా కాపర్ తీగ, ఆయిల్ చోరీ
- లిఫ్టు వద్ద కనీస భద్రత కరువు



దుండగులు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్



ముళ్లపొదల్లో ఉన్న లక్ష్మి లిఫ్టు సబ్ స్టేషన్

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో నిర్మించిన లక్ష్మి ఎత్తిపోతల పథకంతో పాటు శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు భద్రత లేకుండా పోయింది. లక్ష్మి లిఫ్టు ఎత్తిపోయటానికి కావాల్సిన విద్యుత్ సరఫరా చేపట్టడానికి ప్రాజెక్ట్ దిగువన ముప్కాల్ మండలం నల్లూర్ శివారులో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రత్యేకంగా నిర్మించారు. అందులో నుంచి రెండు ట్రాన్స్‌ఫార్మర్లను రెండు రోజుల క్రితం ధ్వంసం చేసి భారీగా కాపర్ తీగ, ఆయిల్‌ను చోరీ చేశారు. విద్యుత్ సబ్‌స్టేషన్ ముళ్లపొదల్లో ఉంది. దీంతో దుండగులకు అనువుగా చేసుకుని భారీ చోరీకి పాల్పడ్డారు. లక్ష్మి లిఫ్టుకు 2018లో ట్రయల్ రన్ నిర్వహించారు. అనంతరం ఒక్క తడికి నీరు అందించారు. తరువాత లిఫ్టు అవసరం రాకపోవడంతో నిర్వహణ గురించి ఎవరూ పట్టించుకోలేదు. కనీసం సెక్యూరిటీని కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో దుండగులు చోరీకి పాల్పడుతున్నారు. అటవీ ప్రాంతంలో ఉండటంతో ఎవరూ కూడ ఉండే అవకాశం లేదని అధికారులు అంటున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌పై భద్రత ఏర్పాటు చేస్తామని ఏళ్ల తరబడి పాలకులు ప్రకటిస్తూనే ఉన్నారు. కాని ఇప్పటికీ ఒక్క అడుగు పడలేదు. కనీసం లిఫ్టుల వద్దయినా భద్రత ఏర్పాటు చేయాలని ఆయకట్టు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఇంకా కంపెనీ చేతుల్లోనే..

లక్ష్మి ఎత్తిపోతల పథకం నిర్మాణంలో మెకానికల్ పనులను కిర్లోస్కర్ కంపెనీ చేపట్టింది. పనులు 2007లో ప్రారంభమై 2018లో పూర్తయ్యాయి. పనులు పూర్తయి ఏడేళ్లు గడుస్తున్నా ఇప్పటికి సంబంధిత అధికారులకు అప్పగించలేదు. ఇంకా కంపెనీ చేతుల్లోనే ఉంది. లక్ష్మి లిఫ్టు ముందు శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ అధికారుల ఆధీనంలో ఉండేది. తరువాత మైనర్ ఇరిగేషన్ శాఖ(బాల్కొండ)కు అప్పగించారు. పాలకులు ఇప్పటికైనా స్పందించి వెంటనే సంబంధిత అధికారులకు అప్పగించి భద్రత ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కంపెనీ వారే చూసుకుంటున్నారు..

లక్ష్మి లిఫ్టు సబ్‌స్టేషన్, పంపులను ఇంకా కంపెనీ వారు అప్పగించలేదు. అక్కడ సెక్యూరిటీ ఏర్పాటు చేయటానికి కూడా వీలు లేని పరిస్థితి ఉంది. ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి భద్రత ఏర్పాటుపై చర్చిస్తాం. – సరేశ్, డిప్యూటీ ఈఈ, మైనర్ ఇరిగేషన్, బాల్కొండ

నేటి చిత్రం



ప్రమాదకరంగా కల్వర్టు

నవీపేట: మండల కేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీకి వెళ్లే దారిలో నిజాంసాగర్ డి–50 ప్రధాన కాలువ కల్వర్టుకు కొన్నేళ్లుగా మరమ్మతులు చేయడం లేదు. కల్వర్టు అంచులు తెగిపోవడంతో వాహనాలు కాలువలోకి దూసుకెళ్తున్నాయి. మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నాం. – గంగాధర్, సుభాష్‌నగర్‌కాలనీ, నవీపేట

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

ఆర్మూర్ : 90102 44405 | బాల్కొండ : 96666 49049 | బోధన్: 99636 95349

క్లుప్తంగా

రైతు భరోసాకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

బోధన్: ఎడపల్లి మండలంలో కొత్తగా వ్యవసాయ పట్టా పాస్ పుస్తకాలు పొందిన వారు రైతు భరోసా పథకానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి సిద్ధి రామేశ్వర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పేర్లను నమోదు చేసుకునేందుకు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్, రైతు భరోసా దరఖాస్తు ఫారంతో ఏఈవోలను సంప్రదించాలని సూచించారు. ఈ నెల 20 లోపు నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని తెలిపారు.

రాణాకలాన్‌లో బీజేపీ సమావేశం



బోధన్: ఎడపల్లి మండలంలోని రాణాకలాన్ గ్రామంలో శుక్రవారం బీజేపీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు కోలా ఇంద్రకరణ్, మండల ఇన్‌చార్జి పిల్లి శ్రీకాంత్ ఆధ్వర్యంలో సమావేశం కొనసాగించారు. మండలంలోని 11 ఎంపీటీసీ స్థానాలకుగాను శక్తి కేంద్ర ఇన్‌చార్జీలను నియమించినట్లు వారు తెలిపారు. పార్టీ మండల సోషల్ మీడియా కన్వీనర్‌గా ప్రేమ్‌కుమార్‌ను నియమించినట్లు వెల్లడించారు. పార్టీ బోధన్ అసెంబ్లీ కన్వీనర్ కూరెళ్ల శ్రీధర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మురుగు నీటి సమస్య పరిష్కారానికి చర్యలు



రుద్రూర్: పోతంగల్ మండలం రాంగంగానగర్‌లో ఇటీవల కురిసిన వర్షానికి మురుగు నీటితో పాటు వరద నీరు ఇళ్లలోకి రావడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. గతంలో డ్రైనేజీ వ్యవస్థ లేనప్పుడు మురుగు నీరు కచ్చా డ్రైయిన్‌లో ఇంకిపోయేవి. సీసీ డ్రైనేజీల నిర్మాణంతో మురుగు నీరు సమీపంలోని పంట పొలాల్లోకి చేరి సేద్యం పనులకు ఇబ్బందికరంగా మారింది. మురికి నీరు పొలాల్లోకి రావద్దని రైతులు, వర్షం కురిస్తే మురికి నీరు, వాన నీరు ఇండ్లలోకి వస్తున్నాయని స్థానికుల ఆందోళన చేయడంతో శుక్రవారం ఎంపీడీవో చందర్ గ్రామానికి చేరుకుని సమస్య తెలుసుకున్నారు. ప్రధాన రహదారి వెంట తాత్కాలికంగా కాలువ తీయించారు. సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామానికి చెందిన బట్టు నాగార్జున కుటుంబానికి గౌడ సంఘం ఆర్మూర్ మండల అధ్యక్షుడు గద్దమీది లింగం గౌడ్ శుక్రవారం రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామానికి చెందిన నాగార్జున నెల రోజుల క్రితం బతుకుదెరువు కోసం అబుదాబి వెళ్లి అదృశ్యమయ్యాడు. దీంతో లింగం గౌడ్ బాధిత కుటుంబ సభ్యులకు చేయూతనందిస్తూ ఆర్థిక సహాయం చేశారు. బీజేవైఎం మండల అధ్యక్షుడు వేల్పుల సతీష్, మేడిపల్లి సాగర్, వేల్పుల లక్కీ, మేడిపల్లి గిరీష్, రాజు, రాఘవ పాల్గొన్నారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు ఆశీర్వచనం



వర్ని: ధూప దీప నైవేద్యం పథకం కింద దేవాలయాల్లో అర్చకులుగా పనిచేస్తున్న వారికి సీఎం రేవంత్ రెడ్డి వరాలు ప్రకటించడంతో హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం వర్ని మండల కేంద్రంలో ఉమ్మడి వర్ని కోటగిరి మండలాల అర్చకులు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కొండా సురేఖ చిత్రపటాలకు ఆశీర్వచనం అందజేశారు. అర్చక సంఘం రాష్ట్ర కార్యదర్శి శివప్ప, రుద్రూర్ మండల అధ్యక్షులు భాను ప్రసాద్, చెన్ బసప్ప, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



పెర్కిట్(ఆర్మూర్): పెర్కిట్‌లో శుక్రవారం జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు ఎస్వీ హన్మంత్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. పెర్కిట్‌కు చెందిన ఎస్వీ హన్మంత్ రెడ్డి ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కార్యవర్గ ఎన్నికల్లో ఉపాధ్యక్షునిగా ఎన్నికయ్యారు. దీంతో శుక్రవారం ఆయనను ఘనంగా సన్మానించారు. జక్రాన్‌పల్లి ఎంఈవో శ్రీనివాస్, కాంతి గంగా రెడ్డి పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాక్లూర్: దాస్‌నగర్ వద్ద విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాజశేఖర్



సాలూరలో.. బోధన్ రూరల్ సీఐ విజయ్‌బాబు

గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. శుక్రవారం మాక్లూర్, బోధన్, రుద్రూర్, కోటగిరి, సాలూర, వర్ని మండలాల పరిధిలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలన, నియంత్రణపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. తెలిసీ తెలియని వయస్సులో తప్పటడుగులు వెస్తే జీవితాంతం నరకం అనుభవించాల్సి వస్తుందన్నారు. డ్రగ్స్ తీసుకుంటే భయంకరమైన కేసులుంటాయన్న విషయం మరిచిపోవద్దన్నారు. కల్తీ కల్లుకు బానిస కావొద్దన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. – సాక్షి నెట్‌వర్క్



కోటగిరిలో .. ఎస్సై సునీల్



బోధన్ పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



రుద్రూర్‌లో ర్యాలీ..



వర్నిలో ..

నిబంధనల ప్రకారమే ఇళ్లు నిర్మించాలి



మోర్తాడ్: ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లబ్ధిదారులుగా ఎంపికైన వారు ప్రభుత్వం సూచించిన నిబంధనల ప్రకారమే ఇళ్లు నిర్మించుకోవాలని భీమ్‌గల్ ఎంపీడీవో గంగుల సంతోష్ సూచించారు. శుక్రవారం బడాభీమ్‌గల్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందించారు.

సమాచారం..

■ నేడు కరెంట్ సరఫరా నిలిపివేత

నవీపేట: నవీపేటతో పాటు మండలంలోని జన్నేపల్లి సబ్‌స్టేషన్‌లలో శనివారం మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ ప్రశాంత్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఫలితంగా నవీపేట, అభంగపట్నం, అబ్బాపూర్(ఎం), హనుమాన్ ఫారమ్, జన్నెపల్లి, సిరన్‌పల్లి, నాడాపూర్ గ్రామాలలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 వరకు కరెంట్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

■ రేపు ప్రకృతి చికిత్సాలయంలో యోగ శిక్షణ

రుద్రూర్: మండల కేంద్రంలోని అక్బర్‌నగర్ సంస్కార్ ప్రకృతి చికిత్సాలయంలో ఆదివారం యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కారించుకుని యోగాపై అవగాహన, శిక్షణ ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.

ఉద్యోగ సాధనే లక్ష్యంగా సాగండి



విద్యార్థినులతో కళాశాల డైరెక్టర్ రజనీకాంత్, అధ్యాపకులు

మాక్లూర్: ఉద్యగ సాధనే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని, ఇంజినీరింగ్ పూర్తి చేసుకుని వెళ్తున్న విద్యార్థినులకు కాకతీయ మహిళా ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ రజినీకాంత్ సూచించారు. శుక్రవారం మాణిక్‌భండార్ వద్దగల కాకతీయ మహిళ ఇంజనీరింగ్ కళాశాలలో 3వ సంవత్సరం చదువుతున్న ఇంజినీరింగ్ విద్యార్థులు నాలుగో సంవత్సరం ఇంజనీరింగ్ పూర్తి చేసుకుని వెళ్తున్న విద్యార్థులకు అక్కడే ఉన్న ఓ ఫంక్షన్ హాల్లో ఫేర్‌వెల్ పార్టీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి రజినీకాంత్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా చదివి ఉద్యోగాలు సాధించాలన్నారు. విద్యార్థినుల నృత్యాలు అలరించాయి. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సెల్వరాజ్, వైస్ ప్రిన్సిపల్ జి.సాయరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటేశ్ జాదవ్



భీమ్‌గల్‌లోని పంక్చర్ దుకాణాల నుంచి పాత టైర్లు, ట్యూబ్‌లను తరలిస్తున్న వైద్య సిబ్బంది



మామిడిపల్లిలో పాత టైర్ల నుంచి నీటిని తొలగిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

రెంజల్(బోధన్): సీజనల్ వ్యాధులపై పంచాయతీ కార్యదర్శులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో వెంకటేశ్ జాదవ్ సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో సంక్రమించే వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆస్పత్రి వైద్యుడు వినయ్‌కుమార్, ఎంఈవో ఆంజనేయులు, ఎంపీవో రఫీయోద్దిన్, ఆరోగ్య విస్తర్ణ అధికారులున్నారు.

నీటి నిలువల వల్లే దోమలు పెరిగే అవకాశం

మోర్తాడ్: వర్షాకాలం ఆరంభమైన దృష్ట్యా ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని భీమ్‌గల్ మండల వైద్యాధికారి అజయ్ పవార్ సూచించారు. శుక్రవారం భీమ్‌గల్ పట్టణంలోని పంక్చర్ దుకాణాల్లో నిలువ ఉంచిన పాత టైర్లు, ట్యూబ్‌లను సేకరించి తరలించారు. వీటి వల్లనే దోమలు వ్యాపించి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. అలాగే ఇంటింటికి వెళ్లి కూలర్లు, ఇతర పాత సామగ్రిలో నిలువ ఉన్న నీటిని పారబోయించారు. సూపర్‌వైజర్ సయ్యద్ వలీద్దిన్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త జక్కుల మోహన్, ఆశా కార్యకర్తలు మమత, సుభద్ర, నవ్య, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య



అడ్మిషన్లు తీసుకున్న విద్యార్థులతో అధ్యాపకులు

ఆర్మూర్‌టౌన్: ప్రభుత్వ కళాశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని కళాశాల ప్రిన్సిపాల్ విజయానందరెడ్డి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు చేరాలని అధ్యాపక బృందం ఆర్మూర్, పెర్కిట్‌తో పాటు మండలంలోని అమ్దాపూర్, మగ్గిడి, ఖానాపూర్, పెర్కిట్‌లో ప్రచారం నిర్వహించారు. ఉచిత హస్టల్, పాఠ్యపుస్తకాలు అందిస్తామని విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. అధ్యాపకులు చంద్రశేఖర్, నరేష్, రామకృష్ణ, లక్ష్మణ్, శ్రీనివాస్‌గౌడ్, సుమన్, నిఖిత, విజయలక్ష్మి, గంగాధర్, చంద్ర మోహన్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నేతలు

ఆర్మూర్‌టౌన్: ప్రైవేటు వ్యాపారస్తులు నకిలీ విత్తనాలను విచ్చలవిడిగా మార్కెట్‌లో అమ్ముతున్నారని, వాటిని నియంత్రించకపోతే రైతులు నష్టపోతారని అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆర్మూర్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు గంగారాం, రాజన్నలు అన్నా రు. ఆర్మూర్ తహసీల్ కార్యాలయంలో అఖిల భారత ఐక్య రైతు సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం నాయకులు తహసీల్దార్‌కు సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సొసైటీల లో ఎరువుల కొరత లేకుండా చూడాలని కోరారు. నేతలు కిషన్, గంగాధర్, రమేష్, నాగన్న, నరేష్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని బస్సులను నియంత్రించాలి



బోధన్‌లో ఎంవీఐ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందిస్తున్న పీడీఎస్‌యూ నేతలు

బోధన్/బోధన్‌టౌన్: ఫిట్‌నెస్ లేని ప్రైవేట్ స్కూళ్ల బస్సులను నియంత్రించాలని కోరుతూ శుక్రవారం పట్టణ కేంద్రంలోని శక్కర్‌నగర్ ఆర్‌టీవో ఆఫీస్‌లో ఎంవీఐ శ్రీనివాస్‌కు పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు గౌతం కుమార్, నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోధన్ డివిజన్‌లో నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు బస్సులు నడుపుతున్నాయని, సీట్లకు మించి మూడింతలు విద్యార్థులను బస్సుల్లో ఎక్కించి వారి జీవితాలతో ఆడుకుంటున్నారని పేర్కొన్నారు. వెంటనే క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని కోరారు. నాయకులు సాయినాథ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ఆర్మూర్‌టౌన్: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని మున్సిపల్ కమిషనర్ రాజు అన్నారు. ఆర్మూర్ పట్టణంలో చేపట్టిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 10, 31వ వార్డులలో పారిశుధ్యం, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతిఒక్కరు తమ ఇళ్లల్లో డెంగీ, మలేరియా నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే హౌసింగ్‌బోర్డు పార్కులో పిచ్చిమొక్కలను తొలగించారు. సానిటరీ ఎస్సై గజానంద్, పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి, వార్డు అధికారులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ అధికారులు

ఆధ్యాత్మికం

■ అలరించిన బోనాల సంబురాలు





నవీపేట: నాళేశ్వర్‌లో మున్నూర్ కాపు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పోచమ్మ, మహాలక్ష్మి దేవతామూర్తులకు బోనాలను సమర్పించారు. మున్నూర్ కాపు కల్యాణ మండపంలో బోనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బినోల సొసైటీ చైర్మన్ మగ్గారి హన్మండ్లు, మాజీ సర్పంచులు ద్యావ సరిన్, నర్సింగ్‌రావ్, నాయకులు చిన్నదొడ్డి ప్రవీణ్, లక్ష్మణ్, రమేష్, సురేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

■ పడగల్‌లో పెద్దమ్మకు ..

వేల్పూర్: పడగల్‌లో ముదిరాజ్ వర్గీయులు గురువారం పెద్దమ్మకు బోనాలు సమర్పించారు. స్థానిక రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముదిరాజ్ సంఘ సభ్యులు పెసరి సుమన్, బద్దం రాజారాం, గుర్రం స్వామి, నరేశ్, రాజేశ్వర్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

■ కల్లూర్‌లో ..

రుద్రూర్: పోతంగల్ మండలం కల్లూర్‌లో శుక్రవారం బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. బోనాలు ఎత్తుకుని బారెడు పోచమ్మ దేవి ఆలయానికి వెళ్లి అమ్మవారికి బోనాలు, నైవేద్యాలు సమర్పించారు. గ్రామం సస్యశ్యామలంగా ఉండాలని పూజలు నిర్వహించారు.



చిన్నారులకు అక్షరాభ్యాసం

జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలల్లో శుక్రవారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఎంఈవోలు, ఉపాధ్యాయులు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందజేస్తారని, రుచికరమైన భోజనం పెడతారని తెలియజేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. – సాక్షి నెట్‌వర్క్



ఆలూర్‌లో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఈవో నరేందర్



కోటగిరి రచ్చగల్లీ పాఠశాలలో...ఎంఈవో శ్రీనివాస్

విమాన ప్రమాద మృతులకు నివాళి



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ఎంఈవోలు, ఉపాధ్యాయులు

బోధన్: ఎయిరిండియా విమాన ప్రమాద మృతులకు సంతాపం తెలుపుతూ వివిధ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. మృతులకు నివాళులర్పించారు. బోధన్, పోతంగల్, మోస్రా మండలాల ఎంఈవోలు నాగయ్య, లోల శంకర్, నాగ్‌నాథ్, హెచ్ఎంలు రత్నాకర్, సాయిలు, పీఆర్‌టీయూ, తపస్ రాష్ట్ర ప్రతినిధులు ఎంబెల్లి శంకర్, కర్రె శంకర్, వివిధ మండలాల నాయకులు గంగాధర్, సాయిలు, ఉదయ్, చందర్ ,లక్ష్మణ్, నాగనాథ్, నగేష్ ,అభయేందర్, తదితరులు పాల్గొన్నారు.